సాక్షి కామారెడ్డి

ఆదివారం । 8 । జనవరి । 2023



రాములు మృతికి..

అడ్లూర్ ఎల్లారెడ్డి రైతు రాములు ఆత్మహత్యకు ప్రభుత్వమే కారణమని ప్రొఫెసర్ కోదండరాం అన్నారు.

- 10లో ▸



దోమకొండకు గుర్తింపు తేవాలి

యునెస్కో అవార్డును సొంతం చేసుకున్న దోమకొండకు జాతీయస్థాయిలో గుర్తింపు తేవాలని కేవీ రమణాచారి అన్నారు.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం 29.2 / 18.3

వాతావరణం

పొగమంచు కురుస్తుంది. చలిగాలులు వీస్తాయి. రాత్రి ఉష్ణోగ్రతలు మరింత తగ్గే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

నేడు రైతు జేఏసీ సమావేశం

సాక్షి, కామారెడ్డి: మాస్టర్ ప్లాన్ ముసాయిదా విషయంలో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించడానికి ఆదివారం ఉదయం 9.30 గంటలకు అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలోని పోచమ్మ మర్రి వద్ద సమావేశం ఏర్పాటు చేశారు. భవిష్యత్ కార్యక్రమాలు, నిర్ణయాలు తీసుకోవడం కోసం సమావేశం ఏర్పాటు చేసినట్లు ప్రతినిధులు తెలిపారు. ప్రతి గ్రామం నుంచి రైతులు హాజరు కావాలని కోరారు.

చట్టాన్ని అతిక్రమిస్తే కేసులు తప్పవు

- ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

కామారెడ్డి క్రైం: కలెక్టరేట్ వద్ద మూడు రోజులుగా జరుగుతున్న శాంతియుత నిరసనలు ఉద్రిక్తంగా మారడానికి రైతుల ముసుగులో కొంత మంది కారణమవుతున్నారని ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. చట్టాన్ని అతిక్రమిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రైతులకు తప్పుడు సమాచారం ఇచ్చి రెచ్చగొడుతున్నారని, తద్వారా రైతులు చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడి క్రిమినల్ కేసుల్లో ఇరుక్కోవడం జరుగుతుందన్నారు. పోలీస్ వాహనాలను, ప్రభుత్వ వాహనాలను ధ్వంసం చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌తోపాటు ఉమ్మడి జిల్లా మంత్రి ప్రశాంత్‌రెడ్డి, కామారెడ్డి కలెక్టర్‌లు మాస్టర్ ప్లాన్ డ్రాఫ్ట్ రూపంలో ఉన్న ముసాయిదా మాత్రమేనని స్పష్టంగా చెప్పినట్లు వెల్లడించారు. కొందరు ఉద్దేశపూర్వకంగా రైతులను రెచ్చగొడుతున్నారని, ఇది సమంజసం కాదన్నారు. జిల్లాలో 30 పోలీస్‌యాక్టు అమల్లో ఉన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించుకోవాలన్నారు. శాంతియుత పద్ధతిలో ప్రభుత్వానికి కలెక్టర్‌కు తమ అభ్యంతరాలను తెలియపర్చవచ్చన్నారు. పోలీస్‌శాఖకు సహకరించాలని కోరారు.


ఏఎస్పీ దురుసు ప్రవర్తన



సాక్షి, కామారెడ్డి : కలెక్టర్ ప్రెస్‌మీట్ కవరేజీకి కోసం వెళ్లిన జర్నలిస్టులను కలెక్టరేట్‌లోనికి వెళ్లడానికి అదనపు ఎస్పీ అన్యోన్య అనుమతించలేదు. కలెక్టర్ ప్రెస్‌మీట్ ఉందని, తమకు డీపీఆర్‌వో నుంచి మెసేజ్ వచ్చిందని చూపించినా ఆయన వినిపించుకోలేదు. పైగా జర్నలిస్టుల పట్ల దురుసుగా ప్రవర్తించాడు. దీంతో కలెక్టర్ ప్రెస్‌మీట్‌ను బహిష్కరించాలని నిర్ణయించుకున్న జర్నలిస్టులు ప్రధాన గేటు వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. విషయం తెలిసిన కలెక్టర్ జితేష్ వి పాటిల్ అక్కడికి చేరుకుని సముదాయించి ఇలాంటివి జరగకుండ చూసుకుందామని చెప్పి అందరినీ తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ పై కలెక్టర్ ఆగ్రహం వ్యక చేశారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

- సీనియర్ సివిల్ జడ్జి కిరణ్‌కుమార్



కామారెడ్డి క్రైం: శిక్షకాలం పూర్తయిన ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని సీనియర్ సివిల్ జడ్జి కిరణ్‌కుమార్ సూచించారు. కామారెడ్డి సబ్‌జైలును శనివారం ఆయన సందర్శించారు. ఖైదీలతో మాట్లాడారు. జైల్‌లోని సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కోర్టు సిబ్బంది భరత్, ఖాజా సమియుల్లాఖాన్, జైల్ సూపరింటెండెంట్ చంద్రసేన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి టౌన్: ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ సంస్థలోని మొబైల్ వెటర్నరీ క్లినిక్‌లో పని చేయడానికి వైద్యులు, పారావెట్ పోస్టుల భర్తీకి అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కో–ఆర్డినేటర్ శ్రీకాంత్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బ్యాచ్‌లర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ ఇన్ ఎనిమల్ కోర్సులో ఉత్తీర్ణత సాధించిన వారు వైద్య పోస్టులకు, డిప్లొమా వెటర్నరీ సైన్స్ లేదా డిప్లొమా ఇన్ ఎనిమల్ కోర్సులో ఉత్తీర్ణత సాధించిన వారు పారావెట్ పోస్టులకు అర్హులన్నారు. తెలంగాణలోని ఏ జిల్లాలోనైనా పోస్టులను భర్తీ చేస్తామన్నారు. అర్హులైన వారు ఒరిజినల్ ధ్రువపత్రాలతో ఈనెల 10, 11వ తేదీలలో ఈఎంఆర్ఐ జీహెచ్ఎస్ గుండ్ల పోచంపల్లి మేడ్చల్ కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. వివరాలకు 7995061581ను సంప్రదించాలన్నారు.

ముసాయిదా చుట్టూ రాజకీయం!

- గ్రీన్, ఇండస్ట్రియల్ జోన్లపై రైతుల్లో ఆందోళన
- నెల రోజులుగా పోరాడుతున్న రైతాంగం
- పచ్చని పంట భూముల్లో చిచ్చుపెట్టారని విపక్షాల ఆరోపణ
- డీటీసీపీ, కన్సల్టెన్సీ నిర్వాకం వల్లే అపోహలన్న ఎమ్మెల్యే
- అందుకే అభ్యంతరాలు స్వీకరిస్తున్నారని వివరణ



కామారెడ్డి మాస్టర్‌ప్లాన్ ముసాయిదా



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న పాత రాజంపేట రైతులు

సాక్షి, కామారెడ్డి: మున్సిపల్ మాస్టర్‌ప్లాన్ ముసాయిదా రాజకీయ వేడిని రగిల్చింది. కామారెడ్డి గల్లీల్లో మొదలైన సెగ ఢిల్లీ దాకా పాకింది. జాతీయ పార్టీలకు సంబంధించి రాష్ట్ర, జాతీయ నాయకులు ఇక్కడి రైతుల ఆందోళనపై స్పందించారు. అయితే ఇది ముసాయిదా మాత్రమేనని, అభ్యంతరాలను పరిశీలించిన తర్వాతే పూర్తిస్థాయి ప్లాన్ తయారవుతుందని అధికారులు వివరించే ప్రయత్నం చేస్తున్నా వివాదం వీడడం లేదు. పైగా ఉద్యమం ఇతర గ్రామాలకూ విస్తరిస్తోంది. అయితే ముసాయిదాపై రోడ్డెక్కిన రైతులకు అండగా విపక్షాలు నిలవడంతో పాటు ప్రత్యక్ష ఆందోళనలకు దిగాయి. ఇది చినికి చినికి గాలివానగా మారింది. రైతులు, రాజకీయ పార్టీలు ఆందోళనల్లో పాల్గొన్న సందర్భంలో పోలీసులు అడ్డుకోవడం ఘర్షణకు దారితీసింది. గొడవల్లో ఆయా పార్టీల నేతలు, రైతులపై కేసులు నమోదు చేసేదాకా వెళ్లింది.

మాస్టర్ ప్లాన్ కోసం రూపొందిచిన ముసాయిదాలో గ్రీన్, ఇండస్ట్రియల్, రిక్రియేషన్ జోన్లుగా పేర్కొన్న భూములు రెండు పంటలు పండేవి కావడం, అలాగే పంట భూముల గుండా వంద ఫీట్ల రోడ్లు చూపడాన్ని రైతులు వ్యతిరేకిస్తున్నారు. ఈ విషయంలో రైతులు నెలరోజులుగా ఆందోళనలు నిర్వహిస్తున్నారు. దశలవారీగా నిర్వహించిన ఆందోళనల్లో వేలమంది రైతులు పాల్గొన్నారు. ఇదే సమయంలో రాములు అనే రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మరింత నిప్పు రాజేసింది. రాములు మృతదేహంతో మున్సిపాలిటీ వద్ద రైతులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. మరుసటి రోజు కుటుంబ సభ్యులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్‌ను ముట్టడించారు. కలెక్టర్ వచ్చి అనుమానాలు నివృత్తి చేయాలని రైతులు డిమాండ్ చేయడం, ఐదు మందో, పదిమందో తన చాంబర్‌కు రావాలని కలెక్టర్ చెప్పడంతో రైతులు కలెక్టర్ వచ్చి సమాధానం చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. దీంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. వేలమంది రైతులు కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సమయంలో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. కలెక్టర్ వచ్చేదాకా కదిలేది లేదని బైఠాయించారు. రైతులకు మద్దతుగా వచ్చిన దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావ్, మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ వెంకటరమణారెడ్డి, కాంగ్రెస్ నేత సుభాష్‌రెడ్డి తదితరులు రైతులతో కలిసి అక్కడే బైఠాయించారు. రాత్రివరకూ ఆందోళనలు కొనసాగాయి. చివరకు రైతులు కలెక్టర్ దిష్టిబొమ్మకు వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. మరుసటి రోజు కామారెడ్డి బంద్‌కు పిలుపునివ్వగా కాంగ్రెస్, బీజేపీ నేతలు, రైతులు పాల్గొన్నారు. అయితే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అదే రోజు సాయంత్రం అడ్లూర్ ఎల్లారెడ్డికి వచ్చి రైతు కుటుంబాన్ని పరామర్శించారు. సమస్యను పరిష్కరించేదాకా కలెక్టరేట్ వద్దే బైఠాయిద్దామని బీజేపీ కార్యకర్తలు, రైతులతో కలిసి వెళ్లి కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ సమయంలో బీజేపీ శ్రేణులు కలెక్టరేట్‌లోకి చొచ్చుకువెళ్లేందుకు పోలీసులతో తలపడ్డారు. బారికేడ్లను తోసివేశారు. ఇరువర్గాలు తోసుకున్నాయి. చివరకు పోలీసులు బండి సంజయ్‌ను అరెస్ట్ చేసి వాహనంలో ఎక్కించడం, అడ్డుకున్న బీజేపీ శ్రేణులు పోలీసు వాహనంపై దాడికి తెగబడ్డారు. దీంతో అద్దాలు ధ్వంసమయ్యాయి. ఈ విషయంలో పోలీసులు పలువురిపై కేసులు నమోదు చేశారు.

పరస్పర విమర్శలు

మాస్టర్‌ప్లాన్ ముసాయిదా రూపకల్పన అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకుల కనుసన్నల్లోనే తయారైందని బీజేపీ, కాంగ్రెస్ నేతలు ఆరోపణలు గుప్పించారు. పంట భూములను ఇండస్ట్రియల్ జోన్‌గా, గ్రీన్ జోన్‌గా, రిక్రియేషన్ జోన్లుగా గుర్తించడంతో పాటు రైతుల భూముల్లో నుంచి వంద ఫీట్ల రోడ్లు తీయడానికి అధికార పార్టీ నేతల స్వార్థ ప్రయోజనాలే కారణమంటూ ఆరోపిస్తున్నారు. దీంతో వివాదం రాజకీయ రంగు పులుముకుంది. ముసాయిదాకు సంబంధించి మున్సిపల్ తీర్మానించిన దానికి విరుద్ధంగా డ్రాఫ్ట్ తయారైందని దీనికి డీటీసీపీ అధికారులు, సంబంధిత కన్సల్టెన్సీ అధికారుల నిర్వాకమే కారణమని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ఆరోపించారు. అయితే ముసాయిదాలో జరిగిన పొరపాట్లను సవరించడానికే అభ్యంతరాలు స్వీకరిస్తున్నారని, అందరి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవడం జరుగుతుందన్నారు. ముసాయిదా అని తెలిసినా, రాజకీయ లబ్ధి కోసం రెండు జాతీయ పార్టీల నేతలు రైతుల్లో అపోహలు పెరిగేలా విషం నింపే ప్రయత్నం చేశారని కాంగ్రెస్, బీజేపీ నేతలపై విరుచుకుపడ్డారు. రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రైతులకు అండగా ఉంటామని స్పష్టం చేశారు.

మరిన్ని గ్రామాలకు విస్తరించిన ఆందోళనలు

మాస్టర్ ప్లాన్ ముసాయిదాపై మరికొన్ని గ్రామాల్లో రైతులు, ప్రజలు ఆందోళనబాట పడుతున్నారు. పాత రాజంపేటలో తమ భూములను గ్రీన్, ఇండస్ట్రియల్ జోన్‌లో చూపారంటూ రైతులు శనివారం రాస్తారోకో నిర్వహించి మున్సిపల్‌కు తరలివచ్చారు. అలాగే డ్రైవర్స్ కాలనీ, బీడీ వర్కర్స్ కాలనీల్లో 30 ఫీట్ల రోడ్లను 60 ఫీట్ల రోడ్లుగా చూపడం ద్వారా తాము ఇళ్లు కోల్పోవాల్సి వస్తుందని ఆయా కాలనీల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీనిపై అభ్యంతరం చెబుతూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. రామేశ్వర్‌పల్లిలో భూములను రిక్రియేషన్ జోన్ కింద చూపడంపై స్థానిక రైతులు హైకోర్టును ఆశ్రయించారు.

అధికారులపై కేటీఆర్‌కు ఫిర్యాదు చేస్తా

- మున్సిపల్ తీర్మానానికి విరుద్ధంగా ముసాయిదా
- అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటాం
- రైతులు ఆందోళన చెందొద్దు
- ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్



విలేకరులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గంప గోవర్ధన్

సాక్షి, కామారెడ్డి: మున్సిపల్ తీర్మానానికి విరుద్ధంగా ముసాయిదా వచ్చిందని, దీనికి డీటీసీపీ అధికారులు, కన్సల్టెన్సీ నిర్వాకమే కారణమని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. రైతుల్లో అపోహలు కలగడానికి ముసాయిదా ఒక కారణమైతే, ప్రతిపక్ష పార్టీల నేతలు చేసిన విష ప్రచారం మూలంగా రైతులు ఆందోళనకు గురయ్యారని పేర్కొన్నారు. శనివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గంప గోవర్ధన్ మాట్లాడారు. తీర్మానంలో పేర్కొన్న దానికి భిన్నంగా ముసాయిదా రూపొందించిన కన్సల్టెన్సీ, డీటీసీపీ అధికారులపై మంత్రి కేటీఆర్‌కు ఫిర్యాదు చేస్తానని వెల్లడించారు. ఇరవై ఏళ్లకు ఒక సారి మాస్టర్ ప్లాన్ తయారు చేస్తారని, అందులో భాగంగా మొదట ముసాయిదా రూపొందించి, దానిపై అభ్యంతరాలు తీసుకుని, తరువాత పరిశీలన జరిపి, కౌన్సిల్ తీర్మానించి ప్రభుత్వానికి పంపడం జరుగుతుందన్నారు. ఎప్పటిలాగే ఈ సారి మున్సిపల్ మాస్టర్ ప్లాన్ కోసం తీర్మానం చేసి ముసాయిదా కోసం పంపడం జరిగిందని వివరించారు. అయితే తీర్మానంలో పేర్కొన్న విధంగా కాకుండా కన్సల్టెన్సీ ఇష్టారాజ్యంగా రూపొందించిందన్నారు. దీనివల్ల రైతుల్లో అపోహలు వచ్చాయన్నారు. ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి అందరి ఆలోచనలకు అనుగుణంగా ముసాయిదాలో మార్పులు చేయడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు రైతుల్లో అయోమయాన్ని, అభద్రతను, అపోహలు కలిగేలా విషప్రచారం చేశారని ఆరోపించారు. ముసాయిదాతోనే అంతా అయిపోయినట్టు రైతులను తప్పుదోవ పట్టించారని పేర్కొన్నారు. రైతుల్లో భయాందోళనలు రేకెత్తించి వారిని రోడ్లపైకి తీసుకువచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కామారెడ్డి పట్టణంలో పెరిగిన జనాభా, వాహనాల రద్దీ సమస్యను అధిగమించేందుకు లింగాపూర్ స్టేజీ దగ్గరి నుంచి పాత జాతీయ రహదారి వరకు వంద ఫీట్ల రోడ్డు ప్రతిపాదించామన్నారు. ఇందులో ఏ ఒక్క రైతు భూమి పోదని స్పష్టం చేశారు. ఇల్చిపూర్ శివారు భూములను మున్సిపల్ తీర్మానంలో ఇండస్ట్రియల్ జోన్‌గా చూపలేదన్నారు. లింగాపూర్, ఇల్చిపూర్, రామేశ్వర్‌పల్లి, అడ్లూర్ తదితర గ్రామాల రైతులెవరూ ఆందోళన చెందవద్దని కోరారు. రైతులకు అండగా తానుంటానని, ఎవరి భూములు ఎటూ పోవన్నారు. కామారెడ్డి పట్టణ పరిధిలో ప్రభుత్వ భూములు కావాల్సినన్ని ఉన్నాయని, ఆ భూములను ఇండస్ట్రియల్, గ్రీన్ జోన్లకు చూపుతామని పేర్కొన్నారు. కామారెడ్డి పట్టణాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని, రోడ్లను విస్తరించామని తెలిపారు.

అపోహలు అవసరం లేదు

- అభ్యంతరాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటాం
- ఎవరి భూములు ఎవరూ తీసుకోరు
- కలెక్టర్ జితేష్ వి పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

సాక్షి, కామారెడ్డి: ముసాయిదాపై అపోహలు అవసరం లేదని, అందరి అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని సరైన నిర్ణయాలు తీసుకుంటామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇరవైఏళ్లకోసారి మాస్టర్ ప్లాన్ రూపొందించడం జరుగుతుందని, దానికోసం మొదట ముసాయిదా తయారు చేయడం, అభ్యంతరాలను తీసుకుని వాటిని పరిశీలించి అందుకు అనుగుణంగా ప్లాన్ రూపొందించడం జరుగుతుందని స్పష్టం చేశారు. అపోహలతో ఆందోళన చెందొద్దని రైతులను కోరారు. ముసాయిదాపై 60 రోజుల పాటు అభ్యంతరాలను స్వీకరించి వాటిని అధ్యయనం చేసి మున్సిపల్ కౌన్సిల్ చేసే తీర్మానం మేరకు ప్లాన్ తయారవుతుందన్నారు. పాత మాస్టర్ ప్లాన్‌లో ఇండస్ట్రియల్ జోన్‌లో ఉన్న భూములేవి ఎక్కడికీ పోలేదని, ఇప్పుడు మాస్టర్ ప్లాన్‌లో ఉన్నవి కూడా ఎటూ పోవన్నారు. ఇప్పటి వరకు 1026 అభ్యంతరాలు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. ప్రతీ దానికి నమోదు చేయడం జరుగుతుందన్నారు. 60 రోజుల తరువాత అభ్యంతరాలన్నింటినీ పరిశీలించి మార్పులు, చేర్పులు ఉంటాయన్నారు. రైతులు అపోహలు తొలగించుకోవాలని కోరారు. ఎవరికి ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావచ్చన్నారు. ముసాయిదాపై అవగాహన కల్పించడానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కలెక్టరేట్ అందరిదనీ, ఎవ్వరూ డ్యామేజీ చేసినా అందరికీ నష్టం జరిగినట్టేనన్నారు. అనవసర ఆందోళనలకు గురికావద్దనిరైతులకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలోఅదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ఉన్నారు.

కలెక్టరేట్ గేటు వద్ద మార్పులు!

- జేసీబీతో డివైడర్ తొలగింపు
- గేటుకు మరమ్మతులు



డివైడర్‌ను తొలగిస్తున్న దృశ్యం

సాక్షి, కామారెడ్డి: రైతుల ఆందోళనల నేపథ్యంలో జరిగిన తోపులాటల్లో డివైడర్లు తట్టి కింద కొందరు పడిపోతుండడంతో పోలీసుల సూచన మేరకు డివైడర్లను తొలగించారు. శనివారం ప్రధాన గేటు వద్ద రెండు గేట్ల మధ్య ఉన్న డివైడర్‌ను జేసీబీ సాయంతో పూర్తిగా తొలగించారు. అలాగే గేటుకు ఉన్న రాడ్లు, గొళ్లాలు విరిగిపోవడంతో వాటికి మరమ్మతులు చేశారు. ఎంత మంది వచ్చి తోసినా జరగకుండా ఏర్పాట్లు చేపట్టారు.



గేట్లకు మరమ్మతులు చేస్తూ..

జెడ్పీ సీఈవోపై వైస్ చైర్మన్ ఆగ్రహం

- స్థాయీ సంఘం సమావేశంలో అంశాలు తగ్గించడంపై నిలదీత
- జిల్లా స్థాయి అధికారుల డుమ్మాపై సభ్యుల ఆగ్రహం



స్థాయీ సంఘ సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్

కామారెడ్డి అర్బన్: జెడ్పీ స్థాయీ సంఘ అంశాల్లో నీటిపారుదల శాఖ, కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలను తొలగించడంపై జెడ్పీ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం సాంఘిక సంక్షేమం, మహిళా శిశు సంక్షేమం స్థాయీ సంఘాల సమావేశాలు జరిగాయి. ఉదయం నిర్వహించిన సమావేశాలకు చైర్‌పర్సన్ శోభ అధ్యక్షత వహించగా, సాయంత్రం నిర్వహించిన వ్యవసాయ స్థాయీ సంఘ సమావేశానికి వైస్ చైర్మన్ పరికి ప్రేమ్‌కుమార్ అధ్యక్షత వహించారు.

వ్యవసాయ స్థాయీ సంఘ సమావేశంలో వైస్ చైర్మన్ మాట్లాడుతూ నీటిపారుదల శాఖ, కాళేశ్వరం ప్రాజెక్టు, షుగర్ కేన్ తదితర అంశాలు ఎందుకు తొలిగించారని సీఈవో సాయాగౌడ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయానికి సంబంధం ఉన్న అన్ని శాఖలు వ్యవసాయ స్థాయీ సంఘంలో ఉండాలని, సంబంధిత అధికారులు సమావేశానికి రావాల్సిందేనని సీఈవోకు స్పష్టం చేశారు. విద్యుత్‌శాఖ ఎస్ఈ రమేశ్‌బాబు స్థాయీ సంఘం సమావేశానికి రాలేకపోతే మీరెందుకు వచ్చారని ఏడీఈ మల్లేశ్‌ను ప్రశ్నించారు. తనకు అవసరమైతే రెండు స్తంభాలను కొనుక్కున్నానని, వ్యవసాయానికి 18 గంటల కరెంట్ ఎక్కడ సరఫరా అవుతుందని ప్రశ్నించారు. గాయత్రి చక్కెర ఫ్యాక్టరీలో తూకంలో మోసం చేస్తున్నారని.. తూనికలు కొలతల అధికారులు కాంటాను తనిఖీ చేయాలని కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ మోహినుద్దీన్ ఆరోపించారు. రైతులకు రుణాలు మాఫీ చేయాలని, పది ఎకరాల లోపు రైతులకే రైతు బంధు సహాయం అందించాలని రామారెడ్డి జెడ్పీటీసీ సభ్యుడు మోహన్‌రెడ్డి అన్నారు. జిల్లాలో ఆయిల్ పామ్ కింద 400 ఎకరాల ప్లాంటేషన్ జరిగిందని ఉద్యాన శాఖ అధికారి పేర్కొన్నారు. తాడ్వాయి, నసురుల్లాబాద్, దోమకొండ, భిక్కనూర్, పిట్లం జడ్పిటిసి సభ్యులు బత్తుల రామాదేవి, సలావత్ జన్నుబాయి, తీగల తిర్మల్‌గౌడ్, తాటిపాముల పద్మ, అరిగెల శ్రీనివాస్‌రెడ్డిలు పాల్గొన్నారు. జిల్లా శాఖల అధికారులకు బదులుగా ఆయా శాఖల సూపర్‌వైజర్లు, సూపరింటెండెంట్‌లు సమావేశాలకు హాజరయ్యారు.

రామారెడ్డి జెడ్పీటీసీ సభ్యుడి వినూత్న నిరసన



సమావేశంలో రామారెడ్డి జెడ్పీటీసీ సభ్యుడు నారెడ్డి మోహన్‌రెడ్డి వినూత్నంగా నిరసన తెలిపారు. పలు డిమాండ్లతో కూడిన టీషర్టు ను ధరించి సమావేశంలో పాల్గొన్నారు. కా మారెడ్డి మున్సిపల్ మాస్టర్ ప్లాన్ రద్దు చేయాలని, ఆత్మహత్య చేసుకున్న రాములు కుటుంబానికి రూ.50లక్షల నష్టపరిహారం చెల్లించాలని, భూమి లేని పేదలకు మూడెకరాల భూమి ఇవ్వాలని, రైతుల రుణాలు మాఫీ చేయాలని, రైతులపై రాక్షసంగా వ్యవహరిస్తున్న శాసనసభ్యులు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

బండి సంజయ్ సహా నేతలపై క్రిమినల్ కేసులు!

సాక్షి, కామారెడ్డి: మున్సిపల్ మాస్టర్ ప్లాన్ ముసాయిదాపై రైతుల ఆందోళనల నేపథ్యంలో జరిగిన గొడవలకు సంబంధించి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సహా పలువురు నేతలపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. కలెక్టరేట్ వద్ద ఈ నెల 6న రాత్రి బండి సంజయ్ నేతృత్వంలో ఆ పార్టీ నేతలు 30 పోలీస్ యాక్ట్‌ను ఉల్లంఘించి ఆందోళనలు చేపట్టడమే గాకుండా పోలీసుల విధులకు ఆటంకం కలిగించి, పోలీసులపై దురుసుగా ప్రవర్తించడం, వారిపై దాడికి పాల్పడడం, పోలీసు వాహనాన్ని ధ్వంసం చేయడంపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఇందులో ఏ1 గా బండి సంజయ్‌ను పేర్కొన్నారు. అలాగే జెడ్పీ మాజీ చైర్మన్ వెంకటరమణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, నాయకులు కిష్టారెడ్డి, ప్రకాశ్, హఫీజ్, లక్ష్మీపతి, మనోజ్, ప్రదీప్ తదితరుల పేర్లను నమోదు చేశారు. అలాగే ఈ నెల 5న కలెక్టరేట్ వద్ద జరిగిన ఆందోళనలో పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతో పాటు పోలీసులను నెట్టివేయడం, కొట్టడం వంటి ఆరోపణలపై నమోదైన కేసులో జెడ్పీ మాజీ చైర్మన్ కాటిపల్లిని ఏ1గా, బండారి నరేందర్‌రెడ్డి, గెల్లుమహేశ్, హఫీజ్, మిడుదల రాజు, ఆనంద్‌రావ్‌తో పాటు మరికొందరిని చేర్చారు. అదే రోజు కలెక్టరేట్ రోడ్డులో చీకట్లో భిక్కనూరు సీఐ వాహనం అద్దాలను గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లతో ధ్వంసం చేశారని మరో కేసు నమోదైంది.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్ట్‌కు ఎంపిక



బాన్సువాడటౌన్: రాష్ట్ర స్థాయి సాంఘిక శాస్త్రం టాలెంట్ టెస్ట్‌కు జిల్లా నుంచి ఏడుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. శనివారం బాన్సువాడలోని కోన బాన్సువాడ ఉన్నత పాఠశాలలో సోషల్ ఫోరం జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. జిల్లాకు చెందిన 230 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన ఏడుగురు విద్యార్థులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన వారిలో సంధ్యారాణి(హస్గుల్), భూమిక (మద్నూర్), అర్చన (మద్నూర్), శివనందిని(తుజాల్పూర్), సుప్రీత్‌రెడ్డి (సదాశివనగర్), హర్షవర్ధన్(గాంధారి) ఉన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశం, సోషల్ ఫోరం జిల్లా అధ్యక్షుడు ప్రసూన్‌కుమార్, బాల్‌రాజ్, వేణు, రవీందర్‌సింగ్, వెంకటేశ్వర్లు, సోమేశ్వర్, శ్రీనివాస్‌గౌడ్, కోటయ్య, ప్రకాష్ ఉన్నారు.

జాతీయ యువ ఉత్సవాలకు..



వినోద్ సంజు మోహన్

బాన్సువాడటౌన్: జాతీయ యువ ఉత్సవాలకు బాన్సువాడకు చెందిన యువ చేయూత యూత్ క్లబ్ చైర్మన్ వినోద్, సభ్యులు సింగర్ రాజు, బల్లెపు మోహన్ ఎంపికయ్యారు. కేంద్ర క్రీడా, యువజన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కర్ణాటకలోని హుబ్లీ జిల్లాలో ఈ నెల 12 నుంచి 16 వరకు ఉత్సవాలు జరగనున్నాయి. ఐదు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాల్లో యూత్ ఫర్ గవర్నెన్స్ అనే అంశంపై వినోద్, కల్చరల్‌లో సంజు,మైక్రో ఆర్ట్స్,పెయింటింగ్‌లో బల్లెపు మోహన్ ప్రదర్శనలు ఇవ్వనున్నారు.

ఐఐసీటీని సందర్శించిన సౌత్‌క్యాంపస్ విద్యార్థులు



భిక్కనూరు: తెలంగాణ యునివర్సిటీ సౌత్ క్యాంపస్ కెమిస్ట్రీ విద్యార్థులు హైదరాబాద్‌లోని ఐఐసీటీ(ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ)ని శనివారం సందర్శించారు. ఎన్ఎంఆర్,మాస్,ఎక్స్ఆర్‌డీ వంటి పరికారాల గురించి తెలుసుకున్నారు.అనంతరం స పల ఆర్గనిక్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ను సందర్శించారు.హెచ్‌వోడీ నాగరాజు ప్రొఫెసర్లు ఉన్నారు.

ఎరువుల కొరత లేదు



నవీపేట: జిల్లాలో యూరియా, ఎరువుల కొరత లేదని జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని యంచ, అల్జాపూర్ గ్రామాల్లో పంటలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. యాసంగి సీజన్‌కు పుష్కలంగా ఎరువులు, యూరియా అందుబాటులో ఉన్నాయని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అమ్మకాల ప్రక్రియ సాజావుగా సాగేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఏఈవోల ఆధ్వర్యంలో కొనసాగుతున్న పంటల నమోదు ప్రక్రియకు రైతులు సహకరించాలని కోరారు. అనంతరం యంచలోని ఎరువుల గిడ్డంగిని ఆయన పరిశీలించారు.

క్షేత్రస్థాయికి రాజకీయం

- కార్యక్రమాలు ముమ్మరం చేసిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు
- నియోజకవర్గాల్లో బీజేపీ బూత్ కమిటీ బాధ్యులతో సమ్మేళనాలు
- బ్లాక్ వారీగా అధ్యక్షులు, డీసీసీ నుంచి బ్లాక్ డెలిగేట్లను నియమించిన కాంగ్రెస్



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : క్షేత్రస్థాయిలో స్థానబలాన్ని పెంచుకునేందుకు రెండు జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌లు పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నాయి. భాగంగా బీజేపీ పార్టీ నాయకత్వం ఆదేశాల మేరకు శనివారం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో బూత్ కమిటీ బాధ్యులతో సమ్మేళనాలు నిర్వహించింది. నిజామాబాద్ అర్బన్‌లో నిర్వహించిన సమ్మేళనానికి పాలక్ బండ కార్తీకా రెడ్డి, ప్రభారీ ధీరజ్‌రెడ్డి హాజరు కాగా, నిజామాబాద్ రూరల్‌లో ప్రభారీ సాంబారి ప్రభాకర్, బోధన్‌లో ప్రభారీ నందారెడ్డి, పాలక్ ముల్కల మల్లారెడ్డి, ఆర్మూర్‌లో పాలక్ అప్పాల గణేష్ చక్రవర్తి, బాల్కొండలో ప్రభారీ మనోహర్, పాలక్ పవార్ పాటిల్ పాల్గొన్నారు. బాన్సువాడ నియోజకవర్గ సమ్మేళనం వర్నిలో జరిగింది. ఈ సమ్మేళనానికి పాలక్ ఆవుల రమాకాంత్, ప్రభారీ నర్సింహారెడ్డి హాజరయ్యారు. ప్రతి బూత్ కమిటీ బాధ్యుడు ఆయా కమిటీ సభ్యులతో సమన్వయం చేసుకునేలా సూచనలు ఇచ్చారు. ప్రతి బూత్ కమిటీ సభ్యుడు తమకు కేటాయించిన పన్నా(ఓటరు జాబితా)లోని ఓటర్లను కలిసేలా ప్లాన్ చేశారు. క్షేత్రస్థాయిలో నిరంతరం ప్రజలను కలిసేలా సూచనలిచ్చారు.

సిద్ధమైన కాంగ్రెస్ శ్రేణులు..

కాంగ్రెస్ పార్టీ విషయానికి వస్తే ఈనెల 26వ తేదీ నుంచి ఏకధాటిగా 60 రోజుల పాటు 'హాత్ సే హాత్ జోడో' కార్యక్రమం చేపట్టేందుకు పార్టీ శ్రేణులను సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 6వ తేదీన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఇప్పటికే డిజిటల్ సభ్యత్వాలు చేసిన కాంగ్రెస్ క్షేత్రస్థాయిలో నిరంతరం ఉండేలా ప్లాన్ చేస్తోంది. క్షేత్రస్థాయిలో పనిచేయకపోతే వారిని మార్చి వారి స్థానంలో కొత్తవారికి బాధ్యతలు ఇస్తామని పేర్కొన్నారు. కాగా తాజాగా జిల్లాలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులను నియమించారు. ప్రతి నియోజకవర్గాన్ని బ్లాక్–ఏ, బ్లాక్–బి గా విభజించి అధ్యక్షులను నియమించారు. ఇలా మొత్తం 11 మందిని బ్లాక్ అధ్యక్షులుగా నియమించారు. అదేవిధంగా ఆయా బ్లాక్‌ల్లో మండలాలు, ప్రాంతాల వారీగా పోలింగ్ బూత్‌లను బట్టి డీసీసీ డెలిగేట్లను నియమించారు. ప్రతి బ్లాక్‌లో ఆరుగురు డెలిగేట్ల చొప్పున ఒక్కో నియోజకవర్గానికి 12 మందిని నియమించారు.

రాములు మృతికి ప్రభుత్వమే కారణం

- బాధిత కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలి
- టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్



రాములు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ప్రొఫెసర్ కోదండరామ్

సదాశివనగర్: మాస్టర్ ప్లాన్‌లో భాగంగా భూమి పోతుందనే బెంగతో ఆత్మహత్యకు పాల్పడిన అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన పయ్యావుల రాములు కుటుంబానికి ప్రభుత్వం వెంటనే రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ డిమాండ్ చేశారు. మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డిలో రాములు కుటుంబాన్ని శనివారం రాత్రి ఆయన పరామర్శించారు. రాములు మృతికి ప్రభుత్వమే కారణమన్నారు. రాములు కుటుంబానికి ఎక్స్‌గ్రేషియాతోపాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా రైతుల భూములను తీసుకోవాలనుకోవడం ప్రభుత్వ ఏకపక్ష నిర్ణయని, ఇది ప్రభుత్వానికి తగదన్నారు. అభివృద్ధి పేరుతో కేసీఆర్ ప్రభుత్వం దోపిడీకి పాల్పడుతుందని ఆరోపించారు. కామారెడ్డి జిల్లాలో ఎనిమిది గ్రామాల రైతులకు చెందిన 2,700 ఎకరాల భూమిని మాస్టర్‌ప్లాన్‌లో చేర్చారని, దీంతో బాధిత రైతులకు జీవనాధారం లేకుండా పోతుందన్నారు. రైతుల భూములను లాక్కునే ఆలోచనను ప్రభుత్వం మానుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై ప్రభుత్వం స్పందించకుంటే రైతులపక్షాన కొట్లాడుతామని పేర్కొన్నారు. టీజేఎస్ ప్రధాన కార్యదర్శి నిజ్జన రమేష్, జిల్లా కన్వీనర్ లక్ష్మణ్‌యాదవ్, రైతువిభాగం ఇన్‌చార్జి కంతి మోహన్‌రెడ్డి, రజనీకాంత్, నాగరాజు ఉన్నారు.

దోమకొండకు గుర్తింపు తీసుకురావాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు రమణాచారి, కలెక్టర్ జితేష్ వి పాటిల్ తదితరులు

- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి

దోమకొండ: యునెస్కో అవార్డును సొంతం చేసుకున్న దోమకొండ గ్రామానికి జాతీయస్థాయిలో గుర్తింపు వచ్చేలా గడికోట ట్రస్టు సహకారంతో కృషి చేయాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి అన్నారు. శనివారం ఆయన గడికోటలో తెలంగాణ సాహిత్యానికి దోమకొండ సంస్థాన సేవ పేరుతో నిర్వహించిన కవి సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. కామినేని వంశానికి చెందిన పాకనాటి రెడ్డిలు దోమకొండ కేంద్రంగా పరిపాలన సాగించి కవులను పోషించారన్నారు. రాష్ట్రంలో, దేశంలో ఎన్నో సంస్థానాలు ఉండగా, దోమకొండ సంస్థానం వారు కవి సమ్మేళనం నిర్వహించడం అభినందనీయమన్నారు. గడికోట ట్రస్టు పేరుతో గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. మౌలిక వసతులు, నిరక్షరాస్యత నిర్మూలన, ఉపాధి అవకాశాల కల్పన దిశగా ముందుకు సాగి, దేశంలోనే ఉత్తమ గ్రామ పంచాయితీగా దోమకొండకు అవార్డు వచ్చేలా పనిచేయాలని, దానికి కలెక్టర్ సహకారం తీసుకోవాలని కోరారు. తాను ఉద్యోగం సాధించాక మొదటి పోస్టింగ్ కామారెడ్డిలో చేశానన్నారు. అనంతరం తెలంగాణ సాహిత్యం పుస్తకాన్ని ఆవిష్కరించారు. పద్మభూషణ్ అవార్డు గ్రహీత, శాంత బయోటెక్ సంస్థల అధినేత వరప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ జితేష్ వి పాటిల్, అదనపు కలెక్టర్ చంద్రమోహన్, తెలంగాణ సంగీత నాటక అకాడమీ అధ్యక్షురాలు దీపికారెడ్డి, గడికోట వారసులు కామినేని అనిల్‌కుమార్, కవులు అయాచితం నటేశ్వరశర్మ, జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, ఎంపీపీ కానుగంటి శారద, సర్పంచ్ నల్లపు అంజలి, తహసీల్దార్ శాంత, ఎంపీడీవో చిన్నారెడ్డి, గడికోట ట్రస్టు సీనియర్ మేనేజర్ బాబ్జీ పాల్గొన్నారు.

ముగిసిన అర్చక ఆగమ పరీక్షలు

- రెండో రోజు 136 మంది హాజరు



నిజామాబాద్ సిటీ: దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రెండురోజుల (శుక్ర, శని) పాటు నిర్వహించిన అర్చక ఆగమ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. నగరశివారు మాధవనగర్ సాయిబాబా ఆలయంలో ఈ పరీక్షలు నిర్వహించారు. రెండో రోజు 40 ఏళ్ల పైబడి అర్చకులకు మౌఖిక పరీక్షలు నిర్వహించినట్లు దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ ఎన్ సుప్రియ తెలిపారు. శనివారం అర్చక ఆగమ పరీక్షలు జోనల్ ఆఫీసర్ విజయరామారావు, ఉమ్మడి జిల్లాల సహాయ కమిషనర్ సుప్రియ పర్యవేక్షణలో జరిగాయి. మొత్తం ఆరు ఆగమాలలో 126 మంది రాత పరీక్షకు హాజరు కావలసి ఉండగ 97 మంది హాజరయ్యారు. అలాగే 40ఏళ్ల పైబడిన అర్చకుల మౌఖిక పరీక్షకు 171 మంది అభ్యర్థులకు 136 మంది హాజరయ్యారు.

గంజాయి తాగుతున్న ఏడుగురి అరెస్ట్



బాల్కొండ: బాల్కొండలో గంజాయి తాగుతున్న ఏడుగురిని శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సై గోపి తెలిపిన వివరాలు.. మండల కేంద్రంలో ఏడుగురు (అందులో ఐదుగురు మైనర్లు) ఒకచోట గంజాయి తాగుతున్నట్లు సమాచారంతో దాడులు చేయగా గంజాయితో పట్టుబడ్డారన్నారు. వారిని తీసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. గంజాయి సేవించిన, విక్రయించిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏఎస్సై రాజేశ్వర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను విజయవంతం చేయాలి

పెర్కిట్: ఆర్మూర్, ఆలూర్ మండలాల్లో ఈ నెల 18 నుంచి నిర్వహించే రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సుదర్శనం వైద్య సిబ్బందికి సూచించారు. ఆలూర్ మండలం దేగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందికి కంటి వెలుగు పై నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ఆయన పరిశీలించారు. దృష్టి లోపం ఉన్నవారిని గుర్తించి కంటి వెలుగు శిబిరానికి తీసుకువచ్చి పరీక్షలు చేయించాలని సూచించారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సుదర్శనం

శివదాస్, జైసీ సువేత, వైద్యాధికారులు పూజా రెడ్డి, ప్రవీణ, రోషిని, పీహెచ్ఎన్ స్వరూప, హెచ్ఈవోలు కాంతయ్య, రవి పాల్గొన్నారు.

విపత్తుల సమయంలో ఎన్డీఆర్ఎఫ్ పాత్ర కీలకం



ఎన్డీఆర్ఎఫ్ బృందంతో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

- అదనపు కలెక్టర్ చంద్రశేఖర్
- ఆకట్టుకున్న ఎన్డీఆర్ఎఫ్ మాక్‌డ్రిల్



మాక్‌డ్రిల్ చేపడుతున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం

సుభాష్‌నగర్: విపత్తులు సంభవించిన సమయాల్లో నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్(ఎన్డీఆర్ఎఫ్) నిర్వర్తించే పాత్ర ఎంతో క్రియాశీలకమైందని అదనపు కలెక్టర్ బి చంద్రశేఖర్ అన్నారు. విపత్తుల సమయంలో ఎన్డీఆర్ఎఫ్ ఎలా స్పందిస్తుంది.. ఎలాంటి పాత్ర పోషిస్తుంది అనే అంశాలపై అవగాహన కల్పించేందుకు శనివారం జిల్లా కేంద్రంలోని క్రీడా అథారిటీ మైదానంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విపత్తుల సమయాల్లో నష్ట నివారణ కోసం ఎన్డీఆర్ఎఫ్ ఎంతో సాహసోపేతంగా విధులు నిర్వర్తిస్తుందని అన్నారు. పక్షం రోజులుగా విజయవాడ కేంద్రంగా విధులు నిర్వర్తించే ఎన్డీఆర్ఎఫ్ బృందం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మాక్ డ్రిల్ ప్రదర్శనలు నిర్వహించి విద్యార్థులు, ప్రజలకు విపత్తులపై అవగాహన కల్పించారని పేర్కొన్నారు. ప్రమాదాలు, విపత్తులు జరిగినప్పుడు సాధారణ పౌరులు కూడా తమవంతు బాధ్యతగా తక్షణమే స్పందించాలని, పోలీస్, అగ్నిమాపక శాఖలకు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం ఎన్డీఆర్ఎఫ్ బృందం సభ్యులను జిల్లా యంత్రాంగం తరఫున అదనపు కలెక్టర్ సత్కరించి, జ్ఞాపికలు బహూకరించారు. అంతకుముందు మొక్కలు నాటారు. నిజామాబాద్ ఆర్డీవో రవి, ఎన్డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ బిటెన్ సింగ్, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి మధుసూదన్, డీఎంహెచ్‌వో సుదర్శనం, డీఐఈఓ రఘురాజ్, నగర పాలక సంస్థ అధికారులు అఫ్జల్ అలీం, సాజిద్, తహసీల్దార్లు సుదర్శన్, ప్రసాద్ పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం ప్రారంభం



శిబిరంలో పాల్గొన్న క్రీడాకారులతో ఎంపీపీ ప్రభాకర్ తదితరులు

మాక్లూర్: మండలంలోని అడవి మామిడిపల్లి ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరాన్ని శనివారం ఎంపీపీ ప్రభాకర్ ప్రారంభించరు. ఈ నెల 12 నుంచి 14 వరకు ఖమ్మం జిల్లా బోనకల్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జరిగే రాష్ట్ర స్థాయి జూనియర్ బాల, బాలికల విభాగంలో జిల్లాకు చెందిన కొందరు క్రీడాకారులు ఎంపికయ్యారు. వారికి శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక శిబిరాన్ని ప్రారంభించారు. సర్పంచ్ చింత మల్లారెడ్డి, జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు గణేష్, రాజేశ్వర్, పాఠశాల హెచ్ఎం రాము, శ్యామ్, కృష్ణమూర్తి, పీఈటీలు భారతి, వినోద్ పాల్గొన్నారు.

మలేరియా టెస్టులు నిర్వహించాలి



నిజామాబాద్‌నాగారం: మలేరియాకు సంబంధించి జిల్లాలో వంద శాతం టార్గెట్ పూర్తయ్యేలా టెస్టులు నిర్వహించాలని డీఎంహెచ్‌వో డా.సుదర్శనం తెలిపారు. నగరంలోని డిప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయ ఆవరణలో శనివారం మలేరియాపై ల్యాబ్‌టెక్నిషియన్లతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మలేరియా టెస్టులు వందశాతం లక్ష్యం సాధించామని ఇదే స్ఫూర్తితో ముందుకు వెళ్లాలన్నారు. ప్రతిరోజు ఉదయం 11గంటలకు ఆయా ఆస్పత్రులకు వచ్చే రోగుల నుంచి శాంపుల్స్ సేకరించి టీహబ్‌కు పరీక్షల నిమిత్తం పంపించాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్, అధికారులు పాల్గొన్నారు.

ఉపన్యాస పోటీలు



నిజామాబాద్‌నాగారం: సుభాష్‌నగర్‌లోని నెహ్రూ యువ కేంద్రం కార్యాలయంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి (పరాక్రమ్ దివస్) సందర్భంగా జిల్లా స్థాయి ఉపన్యాస పోటీలు శనివారం నిర్వహించారు. జిల్లా యువజన అధికారిణి శైలి బెల్లాల్, ఆకాశవాణి అధికారి మోహన్‌దాస్ నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి ఉపన్యాస పోటీలను ప్రారంభించారు. వివిధ మండలాల నుంచి 22 మంది పాల్గొని నేతాజీ గురించి మాట్లాడారు. నగరంలోని గాజులపేటకు చెందిన దాకాయి మాల్యద పోటీల్లో గెలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. నెహ్రూ యువ కేంద్రం సిబ్బంది లత, హరీష్, లక్ష్మి పాల్గొన్నారు.

బిడ్డకు జన్మనిచ్చి తల్లి మృతి

- సాధారణ ప్రసవం కోసం ఆపడంతోనేనని..
- కుటుంబ సభ్యుల ఆందోళన



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ఆర్మూర్‌టౌన్: పండంటి బిడ్డకు జన్మనిచ్చి ఓ తల్లి చనిపోయింది. వైద్యులు సాధారణ ప్రసవం కోసం ఆపడంతోనే ఆమె మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు. వివరాలు.. నందిపేట మండలం డొంకేశ్వర్ గ్రామానికి చెందిన పెంటల శ్రీలత(25)ను ప్రసవం కోసం కుటుంబ సభ్యులు ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి శుక్రవారం తీసుకొచ్చారు. శనివారం శ్రీలతకు పురిటి నొప్పులు రావడంతో వైద్యులు ఆపరేషన్ థియేటర్‌కు తరలించారు. వైద్యులు సాధారణ ప్రసవం చేయడంతో శ్రీలతకు మగ శిశువు జన్మించాడు. కాగా ప్రసవ సమయంలో శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తి శ్రీలతకు గుండెపోటు వచ్చింది. వైద్యులు ఆక్సిజన్ సహాయంతో చికి చేసినప్పటికీ ఆమె మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యంతోనే శ్రీలత మృతి చెందిందని బంధువులు వార్డు ఎదుట ఆందోళన చేపట్టారు. సాధారణ ప్రసవానికి అనుకూలంగా లేకపోయిన వైద్యులు బలవంతంగా చేయడంతో చనిపోయిందని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ వార్డు ఎదుట బైఠాయించారు. సిజేరియన్ చేస్తే బతికేదని కుటుంబ సభ్యులు రోదించారు. పోలీసులు ఆస్పత్రికి చేరుకుని కుటుంబ సభ్యులకు సముదాయించారు.



మృతి చెందిన శ్రీలత

గుండెపోటుతో మృతి

ప్రసవానికి ముందు శ్రీలత ఆరోగ్యంగా ఉందని గైనకాలజిస్టు స్రవంతి తెలిపారు. ప్రసవం అయిన గంట తర్వాత శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తాయన్నారు. ఆక్సిజన్ సాయంతో చికిత్స చేస్తుండగా గుండెపోటు వచ్చి మృతి చెందిందని ఆమె కుటుంబ సభ్యులకు చెప్పారు. శ్రీలతను కాపాడడానికి చేసిన ప్రయత్నాలను కుటుంబ సభ్యులకు వివరించడంతో ఆందోళన విరమించారు.

అత్తింటి వేధింపులతో వివాహిత ఆత్మహత్య



నిఖిత మృతదేహం

జక్రాన్‌పల్లి: అదనపు కట్నం కోసం అత్తింటి వారు వేధించడంతో వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని కలిగోట్‌లో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాలు.. కలిగోట్‌కు చెందిన ఎర్రొల్ల నరేష్‌కు పుప్పాలపల్లికి చెందిన నిఖిత(26)తో ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు. పెళ్లి సమయంలో రూ.5 లక్షల నగదు, తులం బంగారం, పెళ్లి సామగ్రి ఇచ్చారు. పుట్టింటి నుంచి అదనపు కట్నం తీసుకురావాలని భర్త నరేష్‌తో పాటు అత్త లక్ష్మి, మామ నర్సింలు ప్రతి రోజు నిఖితను వేధించేవారు. ఈ క్రమంలో శనివారం నిఖిత ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కాగా తన కూతురి మృతిపై అనుమానాలు ఉన్నాయని తండ్రి గోపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

భార్య కాపురానికి రావడం లేదని ఒకరు..

బాన్సువాడరూరల్: భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన బాన్సువాడ మండలం ఇబ్రాహింపేట్‌లో చోటుచేసుకుంది. సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రాహింపేట్‌కు చెందిన పుట్టి సాయిలు(35)కు సదాశివనగర్ గ్రామానికి చెందిన రజితతో 2008లో వివాహం జరిగింది. వీరికి ఎనిమిదేళ్ల కుమారుడు మనుతేజ్ ఉన్నాడు. అయితే సాయిలు ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లి రెండు నెలల క్రితం వచ్చాడు. డిసెంబర్ 25న భార్యాభర్తలు గొడవపడ్డారు. దీంతో రజిత పుట్టింటికి వెళ్లిపోయింది. సాయిలు ఈనెల 6న భార్యను తిరిగి కాపురానికి పిలువడానికి వెళ్లగా ఆమె రాలేదు. దీంతో మానసికంగా వేదనకు గురైన సాయిలు అదేరాత్రి వచ్చి ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం గమనించిన అతని పెద్ద అన్న పెట్టె పెద్దసాయిలు బాన్సువాడ పోలీసులకు సమాచారం అందించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ యువకుడి మృతి



రాజేందర్(ఫైల్)

మాచారెడ్డి: మండలంలోని గజ్యానాయక్ తండా చౌరస్తా, అక్కాపూర్ గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్సై సంతోష్ కుమార్ తెలిపారు. వివరాలు..అక్కాపూర్ గ్రామానికి చెందిన సూరారం రాజేందర్(33) డిసెంబర్ 31రాత్రి గజ్యా నాయక్ తండా చౌరస్తా నుంచి ద్విచక్ర వాహనంపై అక్కాపూర్ వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కేజీ వీల్ ట్రాక్టర్ ఢీకొని గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై వివరించారు. రాజేందర్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

వరద కాలువలో పడి ఒకరు..

బాల్కొండ: మండలంలోని బస్సాపూర్ శివారులో వరద కాలువలో పడి మండలంలోని కిసాన్‌నగర్‌కు చెందిన రంజన్‌లాల్(45) మృతి చెందాడు. ఎస్సై గోపి తెలిపిన వివరాలు.. రంజన్‌లాల్ గత కొన్ని రోజుల నుంచి మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో గురువారం తాగిన మైకంలో వరద కాలువ వైపు వెళ్లి కాలువలో పడిపోయాడు. ఇంటికి రాక పోవడంతో కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకి లభించలేదు. శనివారం కాలువలో మృతదేహం ఉందని సమాచారంతో కుటుంబ సభ్యులు గుర్తించారు. మృతుడి కుమారుడు అక్షయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై చెప్పారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

ఆర్మూర్‌టౌన్: తమ కూతురు వైష్ణవి ఆత్మహత్యకు కారణమైన నిందితుడిని కఠినంగా శిక్షించాలని పట్టణానికి చెందని గంగమోహన్, రజిని దంపతులు శనివారం నిర్వహించిన సమావేశంలో డిమాండ్ చేశారు. గోవింద్‌పేట్‌కు చెందిన ఓ యువకుడు సోషల్ మీడియాలో వేధించడంతోనే వైష్ణవి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆరోపించారు. కుమార్తె ఆత్మహత్య చేసుకొని 25 రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు నిందితుడిని అరెస్టు చేయలేదని ఆరోపించారు.

నిందితుడి రిమాండ్

పట్టణానికి చెందిన వైష్ణవి ఆత్మహత్యకు కారణమైన గోవింద్‌పేట్‌కు చెందిన సచిన్‌ను శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో సురేష్‌బాబు తెలిపారు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

కొటార్మూర్‌లో చోరీ



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని కొటార్మూర్ అన్నపూర్ణ కాలనీలో తాళం వేసిన ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. శనివారం ఉదయం 11 గంటలకు గుర్రం వెంకట్‌గౌడ్ కుటుంబ సభ్యులతో కలిసి పింఛన్ డబ్బుల కోసం బయటకు వెళ్లారు. తిరిగి వచ్చే సరికి ఇంటి తాళం పగిలిపోయి ఉంది. లోనికి వెళ్లి చూడగా బీరువాలోని రూ.25 వేలు నగదు చోరీకి గురయ్యాయి.